సాక్షి వనపర్తి

సోమవారం ǀ 11 ǀ సెప్టెంబర్ ǀ 2023



పులకించిన మన్యంకొండ

మన్యంకొండలో శనివారం అర్ధరాత్రి ఉట్ల మహోత్సవం వైభవంగా నిర్వహించారు.

వివరాలు 8లో ▸



జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి స్వల్పంగా వరద వచ్చి చేరుతోంది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం 31.2 /23.3

వాతావరణం

రోజులో అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

చదువుతోనే భవిష్యత్



పాన్‌గల్: రామాయణం రచించిన వాల్మీకిని స్ఫూర్తిగా తీసుకొని చదువుకు ప్రాధాన్యమిస్తూ పిల్లలను బాగా చదివించాలని రాష్ట్ర వినియోగదారుల ఫోరం చైర్మన్, వాల్మీకి సంఘం నాయకుడు గట్టు తిమ్మప్ప అన్నారు. ఆదివారం మండలంలోని బండపల్లిలో సర్పంచ్ రాజేశ్వరమ్మ, జెడ్పీటీసీ మాజీ రామ్మూర్తినాయుడు అధ్యక్షతన నిర్వహించిన వాల్మీకి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. పార్టీలు వేరైనా వాల్మీకులందరూ సంఘటితంగా ఉంటూ తమ హక్కుల సాధనకు పోరాడాలన్నారు. ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి చెల్లప్ప కమిటీని నియమించిందని.. ఆ కమిటీ కేంద్రానికి నివేదిక అందించిందని, త్వరలోనే అనుకూలంగా నిర్ణయం తీసుకుంటుందని వివరించారు. చదువుతోనే సమాజంలో మార్పు, భవిష్యత్ ఉంటుందని.. వాల్మీకులందరూ తమ పిల్లలను మంచిగా చదివించి ప్రయోజకులను చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ నాయకులు వేణుగోపాల్‌నాయుడు, టీకే కురమన్న, నీలస్వామినాయుడు, హరిశంకర్‌నాయుడు, తిరుమలేష్‌నాయుడు, అయ్యన్న, రమణ, బీజేపీ రాష్ట్ర మోర్చా అధికార ప్రతినిధి రోజారమణి, బాలమణెమ్మ, మధుబాబు పాల్గొన్నారు.

మూడు దరఖాస్తులు

వనపర్తిటౌన్: వనపర్తి నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి రవీందర్, రామన్నగారి వెంకటేశ్వర్‌రెడ్డి, సబిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదివారం రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము తెలిపారు. రవీందర్ అమెరికాలో ఉన్నందున ఆయన దరఖాస్తును రామన్నగారి వెంకటేశ్వర్‌రెడ్డి ఎన్నికల కమిటీ సభ్యులకు అందజేసినట్లు వెల్లడించారు. వారి వెంట నాయకులు కృష్ణ, బాస్‌శెట్టి, శ్రీనివాసులు, వెంకటరమణ తదితరులు ఉన్నట్లు వివరించారు.

పోలీస్ పికెట్ ఏర్పాటు



గోపాల్‌పేట: మండలంలోని ఏదుల వీరాంజనేయ రిజర్వాయర్‌కు వెళ్లే దారిలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో పికెట్ ఏర్పాటు చేసినట్లు సమాచారం. మొత్తం ఐదుగురు పోలీసు సిబ్బందితో పికెట్ ఏర్పాటు చేశామని రేవల్లి ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు.

ఉచిత విద్యను మేనిఫెస్టోలో పొందుపర్చాలి

ఆత్మకూర్: భారత రాజ్యాంగం ఆర్టికల్ 21ఏ, 45 ప్రకారం దేశవ్యాప్తంగా 14 ఏళ్లలోపు పిల్లలకు ఉచిత నిర్బంధ విద్యను అందించేలా అన్ని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో పొందుపర్చాలని పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది వై.తిప్పారెడ్డి కోరారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఉచిత నిర్బంధ విద్యతో పాటు ఆరేళ్లలోపు చిన్నారులకు పౌష్టికాహారం అందించేలా మేనిఫెస్టోలో పొందుపర్చి అమలు చేయాలని కోరుతూ కేంద్ర ఎన్నికల సంఘాన్ని ప్రతివాదిగా చేస్తూ గతంలోనే పిటీషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు చెల్లించలేక చాలామంది ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంపై దృష్టిసారించాలని, అలాగే ఆత్మకూర్, మక్తల్‌ను రెవెన్యూ డివిజన్లుగా ప్రకటించాలని, పట్టణంలో 100 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

మహిళల మిషన్‌శక్తి



జిల్లాకేంద్రంలో మహిళా ఉద్యోగులకు చట్టాలు, హక్కులపై అవగాహన కల్పిస్తున్న మిషన్‌శక్తి జిల్లా కో–ఆర్డినేటర్ భాస్కర్ (ఫైల్)

- ఒకే గొడుగు కిందకు అభివృద్ధి పథకాలు
- జిల్లా సంక్షేమశాఖలో ప్రత్యేక విభాగం ఏర్పాటు
- ప్రారంభమైన అవగాహన కార్యక్రమాలు

వనపర్తి: మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించేందుకు అమలవుతున్న సంక్షేమ పథకాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు, ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం మిషన్‌శక్తి కార్యక్రమాన్ని రూపొందించి అమలు చేస్తోంది. ఇప్పటి వరకు వేర్వేరు విభాగాలుగా ఉన్న మహిళా పథకాలను మిషన్‌శక్తి పరిధిలోకి తీసుకురావటంతో పాటు జిల్లా సంక్షేమశాఖలో ఆరుగురు సిబ్బందితో మహిళా సాధికారత హబ్ ఏర్పాటు చేశారు. ఇందులో కో–ఆర్డినేటర్, ఇద్దరు జనరల్ స్పెషలిస్టులు, ఆర్థిక అక్షరాస్యత స్పెషలిస్టు, అకౌంటెంట్, మల్టీ పర్పస్ ఉద్యోగి ఉంటారు. వీరు మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేలా అవగాహన, ప్రభుత్వ పథకాల వర్తింపునకు కృషి చేస్తారు. ఇందుకు సంబంధించిన శాఖలు సైతం సంపూర్ణ సహకారం అందించాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఇటీవల నిర్వహించిన సమీక్షలో అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 14 మండలాలు, 5 మున్సిపాలిటీల్లో అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. జిల్లాలోని స్వయం సహాయక మహిళా సంఘాలను కార్యక్రమంలో భాగస్వాములను చేసి తక్కువ సమయంలో ఎక్కువ మందికి అవగాహన కల్పించేలా ప్రణాళిక తయారుచేసే బాధ్యతను కలెక్టర్ డీఆర్డీఓకు అప్పగించారు. వైద్య, ఆరోగ్య, విద్యాశాఖ అధికారులను సమన్వయం చేసుకుంటూ మిషన్‌శక్తి లక్ష్యం దిశగా ప్రారంభమైంది. మిషన్‌శక్తిలో సంబాల్, సామర్థ్య అనే విభాగాల్లో వేర్వేరు కార్యక్రమాలు రూపొందించారు.

సామర్థ్య..

మానవ అక్రమ రవాణా, వాణిజ్య లైంగిక దోపిడీని అరికట్టడం, ఇతర దేశాలకు తరలించిన వారిని తిరిగి సొంత ప్రాంతాలకు రప్పించి కుటుంబాలను పునరుద్ధరించే కార్యక్రమాలు చేపడతారు.

- మహిళా ఉద్యోగులకు భద్రత, ఒంటరిగా ఉన్న వారికి ఆశ్రయం కల్పించటం, స్వయం ఉపాధి అవకాశాలు చూపడం, కుట్లు, అల్లికలులాంటి చేతివృత్తుల్లో శిక్షణ ఇప్పించి స్వశక్తితో జీవించేలా మనోధైర్యాన్ని కల్పిస్తారు. సమాజంలో వారిపై ఉన్న వివక్షను దూరం చేస్తూ కొత్త జీవితాన్ని ప్రారంభింపజేస్తారు.
- ప్రధానమంత్రి మాతృ వందన యోజనలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, ఆర్థిక సాయం అందించడంతో పాటు ఆరోగ్య సంక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను జిల్లా కో–ఆర్డినేటర్ బృందం అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చేస్తారు.

పకడ్బందీగా అమలు చేస్తాం..



మిషన్‌శక్తి పరిధిలోకి వచ్చిన అన్నిరకాల మహిళా అభ్యున్నతి కార్యక్రమాలను జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తాం. ఇందుకు ఆరుగురు సిబ్బందితో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశాం. కొద్దిరోజుల కిందటే జిల్లాలో మిషన్‌శక్తి ప్రారంభమైంది. సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతాం.

– రాంమహేశ్వరరెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ సంక్షేమశాఖ అధికారి

సంబాల్..

ఈ విభాగంలో వన్‌స్టాప్ సెంటర్ (సఖికేంద్రం), మహిళా హెల్ప్‌లైన్, బేటీ బచావో– బేటీ పడావో అనే కార్యక్రమాలు ఉంటాయి. వన్‌స్టాప్ సెంటర్‌లో వేధింపులకు గురైన మహిళలకు భరోసానిస్తూ అయిదు రోజుల పాటు ఆశ్రయం కల్పించి వైద్య, చట్టపరమైన సలహాలు ఇవ్వడం, సమస్యలపై పోరాడేందుకు మద్దతునిస్తారు. మానసిక ధైర్యం కోసం కౌన్సెలింగ్ ఇస్తారు.

- మహిళా హెల్ప్‌లైన్‌లో వన్‌స్టాప్ సెంటర్‌తో పాటు పోలీసు, న్యాయ, ఇతర సేవలు పొందడం, వరకట్న నిషేధం, బాల్యవివాహాలను అరికట్టడం, మహిళల నిరంతర రక్షణ కోసం ఉన్న సర్వీస్‌ల గురించి అవగాహన కల్పిస్తారు.
- బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమంలో బాలల లింగ నిష్పత్తి అసమతుల్యతను తగ్గించటంతో పాటు బాలికలు చదువుకునే అవకాశం కల్పిస్తారు. మహిళా సాధికారతను ఏటా రెండు శాతం పెంచాలనే కార్యక్రమాన్ని కొన్ని నెలల కిందట కేంద్రం ప్రారంభించింది. ఇటీవల జిల్లాలో అమలు చేసేందుకు అనుమతించినట్లు అధికారులు వెల్లడించారు.



ఆత్మకూర్ కళాశాలలో విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం (ఫైల్)

మహిళా చైతన్యజ్యోతి ఐలమ్మ



ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ ఎస్.తిరుపతిరావు

- అదనపు కలెక్టర్ ఎస్.తిరుపతిరావు


వనపర్తి: సబ్బండవర్గాల ఆత్మగౌరవ, మహిళా చైతన్యజ్యోతి వెలిగించిన ఘనత చాకలి ఐలమ్మకే దక్కుతుందని అదనపు కలెక్టర్ ఎస్.తిరుపతిరావు అన్నారు. ఆదివారం సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన ఐలమ్మ వర్ధంతి కార్యక్రమానికి ఆయన హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐలమ్మ ధైర్యం, తెగువ నాటి దేశ్‌ముఖ్‌లు, రజాకార్ల గుండెల్లో భయం పుట్టించిందని, మహిళలకు స్ఫూర్తి ప్రదాత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. ఓవైపు సాయుధ పోరాటం చేస్తూనే మరోవైపు అమ్మలా ఉద్యమకారులకు అన్నం పెట్టి ఆదరించిన మహనీయురాలన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఉద్యోగులు, ప్రజాసంఘాలు, ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ వీరనారి ఐలమ్మ..

తెలంగాణ పౌరుషానికి వారసురాలిగా సాయుధ పోరాటంలో తెగింపు ప్రదర్శించిన వీరనారి ఐలమ్మ అని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదివారం బస్టాండ్ సమీపంలోని ఐలమ్మ విగ్రహానికి పలువురు నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె చేసిన తెలంగాణ సాయుధ పోరాట ఘట్టాలను మంత్రి గుర్తుచేశారు. సమ్మక్క, సారలమ్మ, రాణీ రుద్రమదేవి, ఐలమ్మ వంటి వీర వనితలు చేసిన పోరాటాలను భవిష్యత్ తరాలకు తెలియజేయాలన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

పెబ్బేరు రూరల్: సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని కార్యాలయంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంఘం జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు, ఐద్వా జిల్లా కార్యదర్శి ఏ.లక్ష్మి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐలమ్మ వీరోచిత పోరాటం నైజాం సర్కార్ ప్రాంతంలో ఓ ఉత్తేజాన్ని ఇచ్చిందన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకొని మహిళలంతా మతోన్మాదం, భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా తిరగబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు గోపాలకృష్ణ, రాములు, కృష్ణయ్య, రాబర్ట్, బాలరాజు, జెవీ స్వామి, నాగేష్, కృష్ణయ్య, గంధం గట్టయ్య, బీసన్న, కురుమయ్య పాల్గొన్నారు.



సీఐటీయూ కార్యాలయంలో..

రేపు కబడ్డీ పోటీలు

వనపర్తి టౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అండర్ 14 బాలబాలికల కబడ్డీ టోర్నమెంట్ కం సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ జి.సురేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మదనాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పోటీలు ఉంటాయని.. జిల్లాలోని 14 మండలాల పీఈటీలు, పీడీలు మండలాల జట్లను ఒరిజినల్ బోనఫైడ్ సర్టిఫికెట్లతో ఉదయం 8 గంటలలోగా టోర్నమెంట్ ఇన్‌చార్జ్ రామచంద్రమ్మకు రిపోర్టు చేయాలని పేర్కొన్నారు.

విశ్వబ్రాహ్మణుల కళానైపుణ్యం గొప్పది



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి: విశ్వబ్రాహ్మణుల కళానైపుణ్యం గొప్పదని.. రాతిని శిల్పంగా మలిచి దేవుడి రూపంగా మార్చుతారని, రైతుకు అవసరమైన నాగలి, కర్రు, గొర్రు, మేడితోక, ఎద్దులబండ్లను తయారు చేసేది వారేనని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం జిల్లాకేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విశ్వబ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మానవ జీవితంలో ఎన్నో ఉపకరణాలు విశ్వబ్రాహ్మణుల సాయంతోనే తయారవుతున్నట్లు తెలిపారు. కాలక్రమంలో వచ్చిన మార్పులతో అనేక వృత్తులు రూపాంతరం చెందుతున్నాయని.. ఈ పరిస్థితుల్లో విశ్వకర్మలు సైతం ఇతర రంగాల్లో అద్భుతంగా రాణిస్తున్నారన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధనకు ఆచార్య జయశంకర్ చేసిన కృషిని స్మరించుకునేందుకు బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం పక్కనే ఉన్న పార్క్‌లో విగ్రహం ఏర్పాటు చేశామని.. త్వరలోనే ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమానికి విశ్వకర్మలు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

యువతే పార్టీని నడిపించాలి..


బీఆర్‌ఎస్ పార్టీని ముందుకు నడిపించాల్సిన బాధ్యత యువతపైనే ఉందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చెప్పారు. ఆదివారం రాత్రి పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మండల యువత ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

కేసీఆర్ నాయకత్వంలో అగ్రస్థానం..

సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అన్నిరంగాల్లో దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని మంత్రి నిరంజన్‌రెడ్డి చెప్పారు. ఆదివారం వనపర్తి ఐదోవార్డుకు చెందిన 120 మంది, పెబ్బేరుకు చెందిన గుండ్రాతి నిఖిల్‌గౌడ్ ఆధ్వర్యంలో సుమారు 200 మంది, గోపాల్‌పేట మండలం చాకల్‌పల్లి నుంచి సుమారు 150 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి మంత్రి తన క్యాంపు కార్యాలయంలో గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పదేళ్ల స్వపరిపాలనలో తెలంగాణ వ్యవసాయరంగ స్వరూపం పూర్తిగా మారిపోయిందన్నారు. అన్నివర్గాలకు అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని, అభివృద్ధి ఇలాగే కొనసాగాలన్నా.. అన్నివర్గాలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నా బీఆర్‌ఎస్ పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని సూచించారు. పనిచేసే ప్రభుత్వానికి చేయూతనివ్వాలని కోరారు.

తప్పుల తడక

ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాలో దొర్లిన తప్పులు



- పాయింట్ల కోసం పలువురు అడ్డదారుల్లో ప్రయత్నాలు
- స్పౌజ్, మెడికల్, మ్యూచువల్ బదిలీల్లోనూ అదే తీరు
- అభ్యంతరాలకు నేటి సాయంత్రం వరకు అవకాశం
- ఇప్పటి వరకు అందిన ఫిర్యాదులు 378

ఉమ్మడి జిల్లాలో ఇలా..

జిల్లా	దరఖాస్తులు	అభ్యంతరాలు
మహబూబ్‌నగర్	2,663	58
నాగర్‌కర్నూల్	2,478	130
వనపర్తి	1,639	103
గద్వాల	1,569	60
నారాయణపేట	1,469	27

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి ప్రక్రియ కొనసాగుతుంది. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం వరకు ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన విద్యాశాఖ.. అదేరోజు రాత్రికి సీనియార్టీ జాబితాను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచింది. అనంతరం శనివారం, ఆదివారాల్లో సీనియార్టీ జాబితాపై ఉపాధ్యాయుల నుంచి అభ్యంతరాలను స్వీకరించారు. అయితే జాబితాలో తప్పిదాలపై ఆన్‌లైన్‌లో మొదట దరఖాస్తు చేసుకున్నవారు తర్వాత తప్పులకు సంబంధించి హార్డ్‌కాపీ డీఈఓ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది. ఇలా ఆదివారం సాయంత్రం వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 378 మంది ఉపాధ్యాయులు అభ్యంతరాలకు సంబంధించి డీఈఓ కార్యాలయాల్లో హార్డ్‌కాపీలు సమర్పించారు. ఇందుకు సోమవారం సాయంత్రం వరకు గడువు ఉండగా.. అభ్యంతరాల దరఖాస్తులు మరిన్ని పెరిగే అవకాశం ఉంది. ఈ ప్రక్రియకు సంబంధించి డీఈఓ రవీందర్ ఆదివారం సాయంత్రం వివిధ కమిటీలతో డైట్ కళాశాలలో సమావేశం నిర్వహించారు. అభ్యంతరాలు, హార్డ్‌కాపీలు అందజేసిన అనంతరం పూర్తి స్థాయిలో దరఖాస్తులను పరిశీలించాలని, ఈ అంశాలపై కమిటీలు నిబంధనలు పాటించాలని సూచించారు.

అడ్డదారుల్లో పలువురు..

బదిలీలు, పదోన్నతుల్లో అధిక పాయింట్లు పొందేందుకు పలువురు ఉపాధ్యాయులు అడ్డదారులు తొక్కుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇందులో ప్రధానంగా స్పౌజ్ కేసుల్లో గత 317 జీఓ బదిలీల్లో భాగంగా ఒకసారి స్పౌజ్ వినియోగించుకున్నాక.. ఎస్జీటీలు ఎనిమిదేళ్లు, హెచ్‌ఎంలు ఐదేళ్ల వరకు తిరిగి వినియోగించుకునేందుకు అవకాశం లేదు. కానీ, గతంలో వినియోగించుకున్న వారు తిరిగి ఇప్పుడు కూడా దరఖాస్తు చేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. స్పౌజ్ వినియోగం సంబంధిత ఆర్డర్ కాపీలలో గానీ, సర్వీస్ బుక్కులలో గానీని పలువురు ఎంఈఓలు నమోదు చేయనందుకు వారికి అవకాశంగా మారినట్లు తెలుస్తుంది. గతంలో భార్య దరఖాస్తు చేస్తే.. ఇప్పుడు భర్త, గతంలో భర్త చేస్తే ఇప్పుడు భార్య స్పౌజ్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నట్లు పలు సంఘాలు ఆరోపిస్తున్నాయి. అయితే తప్పుడు స్పౌజ్‌లు ఎక్కువగా నారాయణపేటలో దరఖాస్తు చేసినట్లు సమాచారం.

తప్పుడు ధ్రువపత్రాలతో..

అధిక పాయింట్లు పొందేందుకు పలువురు ఉద్దేశపూర్వకంగా తప్పిదాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. కొంతమంది ఉపాధ్యాయులు పాఠశాలల్లో చేరిన తేదీల విషయంలో తప్పుగా నమోదు చేసినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలో పలువురు అభ్యర్థులు మెడికల్ పాయింట్ల కోసం తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించినట్లు పెద్దఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. చిన్న సమస్య ఉన్న వాటికి క్యాన్సర్, హార్ట్, న్యూరో వంటి సమస్యలతో మేజర్‌గా ఉంటేనే వర్తిస్తుంది. కానీ, లేని సమస్యను చూపించి దరఖాస్తులు చేసినట్లు తెలుస్తుంది. ఇవి ఎక్కువగా నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల, నారాయణపేటలో ఉన్నట్లు సమాచారం. గతంలో మ్యూచువల్ బదిలీల్లో వచ్చినవారు పాత స్టేషన్ పాయింట్ల ద్వారా ముందు జాబితాలోకి వచ్చినట్లు తెలుస్తుంది. వీరు కొత్త స్టేషన్ పాయింట్లలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. బదిలీ ఇష్టం లేని వారు చేరిన తేదీని ఆలస్యంగా.. బదిలీ కావాలనుకున్న వారు ముందుగా తేదీలు పెట్టినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అలాగే కొంతమంది పదోన్నతుల విషయంలోనూ ఇలాంటి అడ్డదారులే తొక్కుతున్నట్లు తెలుస్తోంది.

మచ్చుకు కొన్ని..

- జడ్చర్లలో పనిచేసే ఇద్దరు ఉపాధ్యాయులు భార్యాభర్తలు కావడంతో స్పౌజ్ పాయింట్ల కింద ఇద్దరు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. కానీ, వాస్తవంగా ఒక్కరే దరఖాస్తు చేసుకోవాలి.
- ఓ ఉపాధ్యాయ జంట గతంలో జీఓ 317లో స్పౌజ్‌కు దరఖాస్తు చేసుకుని నారాయణపేటకు వచ్చారు. ఇప్పుడు జరుగుతున్న బదిలీల్లో మళ్లీ స్పౌజ్‌కు దరఖాస్తు చేసుకున్నారు.
- ఓ ఉపాధ్యాయుడు జీఓ 317లో ఇతర జిల్లాకు బదిలీ అయ్యి అక్కడ విధుల్లో చేరాడు. అక్కడ 2, 3 నెలలు పనిచేసిన నెలల తర్వాత పైరవీపై మళ్లీ నారాయణపేట జిల్లాకు వచ్చాడు. అయితే ఈయన ఇక్కడ ఎనిమిదేళ్ల సర్వీస్ పూర్తయినా ఇప్పుడు బదిలీకి దరఖాస్తు చేసుకోలేదన్న ఆరోపణలు వస్తున్నాయి. నారాయణపేటలో ఇలా ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నారు.
- నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో 2018లో బదిలీ అయిన పలువురు స్కూల్ అసిస్టెంట్లు.. 2015లో బదిలీ అయినట్లు చూపించి.. ప్రస్తుత జాబితాలో ముందు వరుసలో ఉన్నారు.

చర్యలు తీసుకుంటాం..

బదిలీలు, పదోన్నతుల విషయంలో ఉపాధ్యాయులు తప్పుడు ధ్రువపత్రాలతో దరఖాస్తులు చేసి అక్రమాలకు పాల్పడితే వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటాం. స్పౌజ్ పాయింట్లు కోసం దరఖాస్తు చేస్తే హెచ్‌ఎంలకు ఐదేళ్లు, ఎస్జీటీలకు ఎనిమిదేళ్ల సర్వీస్ ఉండాలి. తప్పుడు వైద్య ధ్రువపత్రాలు సమర్పించిన ఉపాధ్యాయులు, వాటిని పరిశీలించిన సంబంధిత అధికారులపై కూడా చర్యలు తీసుకుంటాం.

– రవీందర్, డీఈఓ, మహబూబ్‌నగర్

రాష్ట్రంలో బహుజన అధికారం తెస్తాం

అచ్చంపేట/కల్వకుర్తి రూరల్: బహుజన రాజ్యం సాధించడానికి ప్రతిఒక్కరు కృషిచేయాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన నల్లమల నగారా సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. బహుజన అధికారం తెచ్చి.. ప్రగతిభవన్‌లో సీఎం పీఠంపై కూర్చోబెట్టే వరకు నిద్రపోమన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు దొంగలని కాంగ్రెస్ ప్రచారం చేస్తుందని, వాళ్లు కూడా దొంగలేనని దుయ్యబట్టారు. ఒక శాతం ఓట్లు ఉన్నోళ్లు సీఎంలు, మంత్రులు అయితే.. 99 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఏమవ్వాలని ప్రశ్నించారు. ఎవరు ఎవరితో పొత్తులు పెట్టుకోవాలో చెప్పేది మీరు కాదు.. మేం అని ఓ పెద్దమనిషికి సమాధానం చెప్పానన్నారు. ఎవరితోనూ పొత్తులు ఉండవని, మాకు మేమే పోటీ చేస్తామని చెప్పారు. రసమయి బాలకిషన్, గువ్వల బాలరాజు దొరల పాట పాడుతున్నారని విమర్శించారు. సాయిచందు బీఆర్‌ఎస్‌కు ఊడిగం చేశారని, ఆయన చనిపోతే కనీసం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు చేయలేని దుర్మార్గమైన ప్రభుత్వం బీఆర్‌ఎస్‌ది అన్నారు. 1,300 మంది తెలంగాణ బిడ్డల త్యాగాల వల్ల వచ్చిన తెలంగాణ నేడు దొంగలు, కబ్జాదారుల పాలైందని దుయ్యబట్టారు. ఈ ప్రాంతంలో ఉన్న అనుబంధం మర్చిపోలేమని, గువ్వల బాలరాజు నేను ఇక్కడ పుట్టి పెరిగినా.. నీవు అతి చేస్తే మా దెబ్బ చూపుతామని హెచ్చరించారు. అంతకు ముందు చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్, అసెంబ్లీ ఇన్‌చార్జ్ నాగార్జున్, జిల్లా ఉపాధ్యక్షుడు రామన్న, యేసేపు, ప్రధాన కార్యదర్శి రామచందర్, విష్ణువర్ధన్, కుమార్ పాల్గొన్నారు.



అచ్చంపేటలో అభివాదం చేస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

పాలమూరు రైతులకు తీరని అన్యాయం..

ప్రత్యేక రాష్ట్రంలోనూ పాలమూరు రైతులకు అన్యాయమే జరుగుతుందని ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. తొమ్మిదేళ్లుగా ప్రాజెక్ట్ పూర్తి కాకపోవడంతో స్థానిక రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. రాష్ట్రంలో పాలమూరు– రంగారెడ్డి పథకానికి ఒక న్యాయం.. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు మరో న్యాయమా అని ప్రశ్నించారు. పాలమూరు ప్రాజెక్ట్‌కు అరకొర నిధులు విడుదల చేయడం వల్లే ఇప్పటి వరకు కాల్వల నిర్మాణమే పూర్తి కాలేదన్నారు. రిజర్వాయర్లు సైతం అసంపూర్తిగానే ఉన్నాయన్నారు. అసంపూర్తి ప్రాజెక్ట్ ప్రారంభానికి సీఎం కేసీఆర్ ఏ ముఖం పెట్టుకుని వస్తారని, జల ఉత్సవాలు చేయాలని చెప్పడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని డిండి ఇతర ప్రాజెక్ట్‌లకు చేసిన భూసేకరణకు ఇంతవరకు డబ్బులు చెల్లించలేదని విమర్శించారు. పాలమూరుకు జరుగుతున్న అన్యాయాలపై మంత్రులు, ఎమ్మెల్యేలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. శ్రీనివాస్‌యాదవ్, ఆంజనేయులు, స్వాములు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

గండేడ్: ఉపాధి కోసం వెళ్లిన ఓ యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. రుసుంపల్లికి చెందిన గొల్ల బాలకిష్టయ్య(30) శంషాబాద్ మండలం నాగారం బాతులగూడెం వద్ద తోటల్లో పనిచేస్తున్నాడు. 11ఏళ్ల క్రితం ఇతనికి పెళ్లి కావడంతో భార్య లక్ష్మితో కలిసి అక్కడే ఉంటూ పనిచేసుకుంటున్నారు. ఆదివారం ఉదయం 8 గంటలకు తన యజమాని ఇంటి ముందు సీకులు ఉండడంతో వాటిని ఇంటిపై పెట్టాలని చెప్పాడు. దీంతో బాలకిష్టయ్య వాటిని తీసుకొని పైకి వెళ్లాడు. ఇంటి పక్కనే ఉన్న విద్యుత్ వైర్లను అతను గమనించలేదు. అనుకోకుండా సీకు వైర్లకు తగలడంతో విద్యుదాఘాతంతో అతను అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చికిత్స పొందుతూ యువకుడు..


అబ్దుల్ (ఫైల్)

చిన్నచింతకుంట: పాముకాటుకు గురై చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని లాల్‌కోటకు చెందిన చెందిన అబ్దుల్ (30) నాలుగు రోజుల క్రితం గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలో రాత్రి నిద్రిస్తుండగా కట్ల పాము కాటు వేసింది. అబ్దుల్ ఇంటికి వెళ్లి విషయం కుటుంబసభ్యులకు తెలపగా, వెంటనే మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతినికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

ప్రేమపెళ్లికి ఒప్పుకోలేదని.. యువకుడి బలవన్మరణం

బిజినేపల్లి: ప్రేమ పెళ్లికి ఒప్పుకోలేదని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గంగారం చెందిన బీ.రవీందర్‌రెడ్డి(26) ఓ బాలిక కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఆ సమయంలో బాలిక మైనర్ కావడంతో ఆమె కుటుంబ సభ్యులు రవీందర్‌పై పోక్సో కేసు పెట్టారు. ఈ మధ్యకాలంలో ఆ అమ్మాయికి మైనార్టీ తీరడంతో తనకిచ్చి పెళ్లి చేయాలని ఆ అమ్మాయి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను అడిగాడు. వారు నిరాకరించడంతో మనస్తాపానికి గురైన రవీందర్ శనివారం సాయంత్రం పెద్దతండా శివారులో ఆత్మహత్య చేసుకుంటున్నానని తన కుటుంబ సభ్యులకు సమాచారం అందించి పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించి ఫోన్ లొకేషన్ ద్వారా గుర్తించారు. అప్పటికే రవీందర్‌రెడ్డి మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, తదుపరి విచారణ చేస్తామని ఎస్‌ఐ రాములుయాదవ్ తెలిపారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

దామరగిద్ద: ఇంట్లో గొడవ పడి వృద్ధురాలు బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని వత్తుగుండ్లకు చెందిన గొల్ల భీమమ్మ (60) కొంతకాలంగా తన కుటుంబ సభ్యులతో గొడవ కారణంగా తీవ్ర మనస్తాపానికి గురైంది. శనివారం గ్రామ సమీపంలోని బావితో దూకింది. ఆదివారం మృతదేహం నీటిలో తేలడంతో స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మతిస్థిమితం లేకపోవడంతో బావిలో దూకి చనిపోయిందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయమై ఎలాంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు. మృతురాలికి కుమారుడు, కోడలు ఉన్నారు.

బైక్ అదుపు తప్పి ముగ్గురికి గాయాలు

ఉండవెల్లి: బైక్ అదుపు తప్పి ముగ్గురికి గాయాలైన ఘటన జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన తండ్రి మధు, కూతురు రాగిణి, కుమారుడు నిహాల్ కర్నూల్ వెళ్తున్నారు. ఈ క్రమంలో అలంపూర్‌చౌరస్తా వద్ద గల ధాబా ఎదుట బైక్ అదుపు తప్పి ముగ్గురు కిందపడ్డారు. ముగ్గురికి గాయాలు కావడంతో హైవే అంబులెన్స్‌లో కర్నూల్ తరలించారు.

4 కేజీల గంజాయి పట్టివేత

పాన్‌గల్: ద్విచక్ర వాహనంపై గంజాయి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ వేణు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం సమీపంలో ఆదివారం వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో వనపర్తి నుంచి కొల్లాపూర్ వైపు ద్విచక్ర వాహనంపై పసుపు రంగు ప్లాస్టిక్ సంచి తీసుకొని వస్తూ పోలీసుల వాహనాల తనిఖీని చూసి తప్పించుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు పట్టుకుని అతనిని విచారించారు. దీంతో వీపనగండ్ల మండలం తూంకుంటకు చెందిన శివగా గుర్తించారు. వాహనం, అతనిని పట్టుకుని ప్లాస్టిక్ సంచిని తీసి చూడగా అందులో గంజాయి కనిపించిందన్నారు. డిప్యూటీ తహసీల్దార్ చక్రపాణి, ఇద్దరు పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి ద్విచక్ర వాహనం, 4 కేజీల గంజాయిని సీజ్ చేసి అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఇదిగో.. వచ్చేస్తున్నా

- వివిధ రూపాల్లో వినాయక విగ్రహాల తయారీ
- మట్టి విగ్రహాలపై అవగాహన



అచ్చంపేట/ఆత్మకూరు: భక్తులను దీవించడానికి మన బొజ్జ గణపయ్య సిద్ధమయ్యారు. వారం రోజులు ఆగితే పురవీధుల్లో ఆదిదేవుని దర్శన భాగ్యం కలగనుంది. ఇప్పటికే మంటపాల నిర్వాహకులు విరాళాలు సేకరించి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కార్మికులు గణపయ్యల తయారీలో ఉన్నారు.

మట్టి వినాయకుడికి జై..

పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఇటీవల మనం మొక్కలు నాటాం. వాటి సంరక్షణ బాధ్యతను భుజాలకెత్తుకున్నాం. పరిసరాలను మనం కాపాడితే.. అవి మనల్ని కాపాడుతుందనే భావనలోంచే ఇది పుట్టింది. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో ఆకర్షణీయంగా దర్శనమిస్తాడని ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో పాటు వివిధ రకాల రసాయనాల కలబోతతో రంగురంగులతో తయారు చేసిన వినాయక విగ్రహాలకు బదులు మట్టి వినాయకులను పూజిద్దాం. నీటి కాలుష్యాన్ని తగ్గిదాం. పర్యావరణ పరిరక్షణ కోసం మరో అడుగు ముందుకు వేస్తున్నారు. చిన్న గణపయ్యలే మహా శ్రేష్ఠంగా పేర్కొంటూ చిన్నారులు, మహిళా సొసైటీలు మట్టి గణపయ్యలకు శ్రీకారం చుడుతున్నారు.

రక్షిత మహిళా సొసైటీ కృషి

అచ్చంపేట రక్షిత మహిళా సొసైటీ ప్రతినిధులు మట్టితో తయారు చేసిన విగ్రహాలను ఆరేళ్లుగా ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఈఏడాది కూడా పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. రసాయన విగ్రహాలను వాడటం ద్వారా కలిగే అనర్థాల గురించి సొసైటీ ప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

↑ ఆత్మకూర్‌లో విగ్రహాలకు ఫినిషింగ్ ఇస్తున్న కళాకారుడు


ఆత్మకూర్‌లో గాజు డైమండ్లతో ముస్తాబైన గణేషుడు

బొజ్జలు నింపుతున్న బొజ్జ గణపయ్యలు..

వలస జిల్లాగా పేరొందిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో వివిధ ప్రాంతాలు, రాజాస్థాన్ నుంచి కళాకారులు వలస వచ్చి ఉపాధి పొందుతున్నారు. తమ కళానైపుణ్యంతో వివిధ రూపాల్లో బొజ్జ గణపయ్యలను తయారు చేస్తూ వారి బొజ్జలు నింపుకుంటున్నారు. సెప్టెంబర్ 18వ తేదీన వినాయకచవితిని పురస్కరంచుకుని ఆత్మకూర్‌లో ప్రత్యేక షెడ్లు వేసుకొని రాజస్థాన్ కళాకారులు వినాయక ప్రతిమలు తయారు చేస్తున్నారు. సైజును బట్టి ఒక్కో విగ్రహాన్ని రూ. 100 నుంచి రూ.25వేల వరకు విక్రయిస్తారు.

కష్టానికి ప్రతిఫలం..



మాది రాజస్థాన్ రాష్ట్రంలోని పాలి జిల్లాలోని సాద్రి గ్రామం. మా ప్రాంతంలో ప్రతిమలు తయారుచేసే కళాకారులు చాలా మంది ఉన్నారు. అక్కడ పనిలేక పోవడంతో ఆత్మకూర్‌లో షెడ్డు వేసుకుని ఏడాదిగా విగ్రహాలను తయారు చేస్తున్నాం. కష్టానికి తగ్గ ప్రతిఫలం వస్తుంది.

– రమేష్‌సింగ్, కళాకారుడు, రాజస్థాన్

కడుపు నింపుతున్నాడు..



దేవుడిని నమ్ముకుని విగ్రహలను కొనుగోలుదారుల కోరిక మేరకు ఆశించిన స్థాయిలో తయారు చేస్తున్నాం. కొన్ని విగ్రహాలకు గాజు డైమండ్లతో ముస్తాబు చేశాం. సుదూర ప్రాంతాల నుంచి విగ్రహాలను కొనేందుకు వస్తున్నారు.

– రాంలాల్‌జీ, కళాకారుడు, రాజస్థాన్

కొనుగోలుదారులకు ఖర్చు తగ్గింది..



హైదరాబాద్ వెళ్లి అధిక ధరలకు విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. ఖర్చు భారాన్ని తగ్గించాలని స్థానికంగానే విగ్రహాల తయారీ చేపడుతున్నాం. ఆశించిన స్థాయిలో గణనాధుల విగ్రహాలు అమ్ముడవుతున్నాయి. ఇప్పటికే వందకుపైగా విగ్రహాలకు అడ్వాన్సులుగా డబ్బులను ఇచ్చారు. వెయ్యికిపైగా విగ్రహాలను తయారు చేసి సిద్ధం చేశాం.

–రాజు, వ్యాపారి, ఆత్మకూర్

జ్యువెలరీ, కిరాణం షాపుల్లో చోరీ

భూత్పూర్: మండలంలోని ఎల్కిచర్లలో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు జ్యువెలరీ షాపుతో పాటు కిరాణ దుకాణంలో బంగారు, వెండి ఆభరణాలతో పాటు కిరాణా దుకాణంలో నగదు దొంగిలించినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్కిచర్ల చెందిన వి.తరుణ్‌కుమార్ జ్యువెలరీ షాపు నడుపుతున్నాడు. శనివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం 6 గంటలకు జ్యువెలరీ షాపు పక్కనే గోపి తన కిరాణ షాపును తెరవడానికి రావడంతో జ్యువెలరీ దుకాణం యొక్క షట్టర్ కొద్దిగా పైకి లేచి ఉండటాన్ని గమనించి తరుణ్‌కుమార్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. షాపు యజమాని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐతో పాటు సిబ్బంది పరిశీలించి వివరాలు సేకరించారు. 12 జతల బంగారు కమ్మలు, 4 జతల బంగారు పుస్తల గుండ్లు, ముక్కుపుల్లలు, 30 తులాల వెండి మెడ గొలుసులు, వెండి ఉంగరాలు, చోరీకి గురైనట్లు, జ్యువెలరీ పక్కనే ఉన్న కిరాణ దుకాణంలో సైతం రూ.25వేల నగదును చోరీకి గురైయ్యాయని యజమాని ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్ దొంగిలించిన వ్యక్తి రిమాండ్


పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

నాగర్‌కర్నూల్ క్రైం: వ్యక్తిపై దాడి చేసి బైక్, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లిన నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ మహేందర్ ఆదివారం తెలిపారు. ఈనెల 2న మండలంలోని శ్రీపురం చెందిన బత్తుల నాగయ్య జిల్లాకేంద్రంలో మేస్త్రి పని ముగించుకుని స్వగ్రామానికి వెళ్తుండా, మార్గమధ్యలో జిల్లా కేంద్రానికి చెందిన నీలంబర్‌తో పాటు మరో ఇద్దరు బత్తుల నాగయ్యపై దాడికి పాల్పడి బైక్, సెల్‌ఫోన్‌ను లాక్కుని పరారయ్యారు. బాధితుడు స్థానిక పోలిస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న ఎస్‌ఐ దర్యాప్తు ప్రారంభించి నిందితుడు నీలంబర్ నుంచి బైక్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామని, మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

మరో నిందితుడిని..

మండలంలోని తూడుకుర్తి చెందిన రాజు గత నెల 31న తన భార్య ప్రసవం కోసం జనరల్ ఆస్పత్రికి వచ్చి ద్విచక్రవాహనాన్ని ఆస్పత్రి ఆవరణలో ఉంచగా చోరీకి గురైంది. గంగారం చెందిన చరణ్ ద్విచక్రవాహనాన్ని కూడా ఆస్పత్రి ఆవరణలో నిలిపి ఉంచగా చోరీకి గురైంది. ఇరువురు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ఆదివారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన వనపట్లకు చెందిన ఆంజనేయులును అదుపులోకి తీసుకుని విచారించడంతో చోరీకి పాల్పడినట్లు అంగీకరించాడు. నిందితుడి నుండి చోరీకి పాల్పడిన ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జూరాలకు 10వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో


జెన్‌కో జల విద్యుత్ కేంద్రానికి వెళ్తున్న నీరు

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో మరింత తగ్గముఖం పట్టినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం సాయంత్రం 7 గంటల వరకు ప్రాజెక్టుకు ఎగువ నుంచి 16,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో 10వేలకు తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగమైన గుడ్డెందొడ్డి లిఫ్టు–1 వద్ద ఒక పంపు ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, ఆవిరి రూపంలో 94, ఎడమ కాల్వకు 920, కుడి కాల్వకు 738, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 60, సమాంతర కాల్వకు 850, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 8,737 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 8.929 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇదిలా ఉండగా ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 129.72 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 115.058 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 11వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 37.64 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 25.77 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 10,899 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, ఎలాంటి అవుట్ ఫ్లో లేదని అధికారులు తెలిపారు.

స్వల్పంగా విద్యుదుత్పత్తి..

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో స్వల్పంగా ఉత్పత్తి కొనసాగుతుంది. ఆదివారం 2 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ రామసుబ్బారెడ్డి, డీఈ పవన్‌కుమార్ తెలిపారు. ఎగువలో ఒక యూనిట్ ద్వారా 39 మెగావాట్లు, 80.437 ఎం.యూ., దిగువలో ఒక యూనిట్ ద్వారా 40 మెగావాట్లు, 86.813 ఎం.యూ. విద్యుదుత్పత్తిని చేపడుతున్నామన్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 167.250 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామని తెలిపారు.

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో ఆదివారం నాటికి పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు వచ్చి చేరింది.

శ్రీశైలంలో 854.7 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో ఆదివారం 854.7 అడుగుల వద్ద 91.1 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 5,385 క్యూసెక్కుల నీటిని శ్రీశైలంకు వదులుతున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 1,583, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,455, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 800 క్యూసెక్కుల నీటిని వదిలారు. జలాశయంలో 197 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

కిటకిటలాడిన జడ్చర్ల బస్టాండ్



జడ్చర్ల టౌన్: సెలవుదినం, పెళ్లిళ్ల సీజన్ కావటంతో ఆదివారం స్థానిక బస్టాండ్ కిటకిటలాడింది. ముఖ్యంగా హైదరాబాద్ వెళ్లాలనుకున్న ప్రయాణికులు బస్సుల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. స్థానిక బస్టాండ్ మీదుగా ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ డిపోలతోపాటు రాయలసీమ, కర్ణాటక ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో హైదరాబాద్ బస్సులు వెళ్తుంటాయి. ఆయా డిపోల నుంచి వచ్చే బస్సులలో సీట్లన్నీ బస్టాండ్‌లలోనే నిండి రావటం, సూపర్‌లగ్జరి, ఆపై బస్సుల్లో సీట్లు రిజర్వు చేసుకునే సదుపాయం స్థానికంగా లేకపోవటం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బస్టాండ్‌లో రిజర్వేషన్ చేసుకునేందుకు కౌంటర్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

హోరాహోరీగా ఎండీసీఏ లీగ్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రం పిల్లలమర్రి సమీపంలోని క్రికెట్ మైదానంలో ఎండీసీఏ లీగ్ మ్యాచ్‌లు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. ఆదివారం లీగ్ మ్యాచ్‌లో ఎల్లో జట్టు 6 వికెట్ల తేడాతో రెడ్ జట్టుపై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన రెడ్ జట్టు 18 ఓవర్లలో 3 వికెట్లకు 98 పరుగులు చేసింది. జట్టులో సంజయ్ 57 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఎల్లో జట్టు 17.5 ఓవర్లలో 4 వికెట్లకు 99 పరుగులు చేసింది. సిద్ధార్థ 39 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. మరో లీగ్ మ్యాచ్‌లో పర్పుల్ జట్టు 95 పరుగుల తేడాతో బ్లూ జట్టుపై గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన పర్పుల్ జట్టు 18 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 135 పరుగులు చేసింది. జట్టులో మేరాజ్ 48 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బ్లూ జట్టు 14.2 ఓవర్లలో 40 పరుగులకే ఆల్ ఔట్ అయ్యింది. ధనూష్ 3 వికెట్లు తీశాడు.

కర్వెన వద్ద పోలీస్ పికెటింగ్


కర్వెన వద్ద ప్రాజెక్టు వెళ్లే మార్గంలో పోలీసులు

భూత్పూర్: మండలంలోని కర్వెన వద్ద ఆదివారం పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. 16న సీఎం కేసీఆర్ కొల్లాపూర్ వద్ద పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు వస్తుండటంతో చెక్ పోస్టు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు. 10 రోజుల పాటు పికెటింగ్ ఉంటుందన్నారు. శనివారం మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రాజెక్టు సందర్శనకు వెళ్లకుండా అడ్డుకున్న విషయం తెలిసిందే. ప్రతి పక్షం, ఇతర పార్టీలకు చెందిన నేతలు, నాయకులు ప్రాజెక్టు సందర్శించడానికి వస్తారనే అనుమానంతో పికెటింగ్ ఏర్పాటు చేశారు.

ఆలయ హుండీ చోరీ

చిన్నంబావి: మండలంలోని కొప్పునూరులో శ్రీకృష్ణుని దేవాలయంలో హుండీని గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి ఎత్తుకెళ్లారు. అందులో రూ.20వేల వరకు నగదు ఉంటుందని శ్రీకృష్ణ యాదవ సంఘం అధ్యక్షుడు కాశన్న తెలిపారు. ఆయన ఆదివారం ఉదయం ఆలయంలో పూజలు చేసేందుకు వెళ్లగా హుండీని ధ్వంసం చేసి నగదును ఎత్తుకెళ్లారని, వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ కృష్ణ ఓబుల్‌రెడ్డి పేర్కొన్నారు.

పులకించిన మన్యంకొండ

- ఘనంగా ఉట్ల మహోత్సవం, శేషవాహన సేవ


అలంకరణలో మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో శనివారం అర్ధరాత్రి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల సందర్భంగా ఉట్ల మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏడాది శ్రావణ మాసంలోని చివరి శనివారం రోజు రాత్రి స్వామివారి సన్నిధిలో ఈ ఉట్ల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఓబ్లాయపల్లికి చెందిన భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని ముగించారు. ఉట్ల మహోత్సవం తర్వాత ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం స్వామివారిని మళ్లీ పల్లకిలో గర్భగుడి వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. శ్రావణమాసం సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి స్వామివారి ఉట్ల మహోత్సవంలో పాల్గొనడానికి వేలాది మంది భక్తులు మన్యంకొండకు తరలివచ్చారు.

వైభవంగా శేషవాహనసేవ..

దేవస్థానంలో రాత్రి స్వామివారి శేష వాహనసేవ వైభవంగా నిర్వహించారు. ప్రతి శనివారం స్వామివారి తిరుచ్చిసేవ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఈనెలలో వచ్చే ప్రతి శనివారం రోజు రాత్రి తిరుచ్చి సేవకు బదులుగా శేషవాహన సేవ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.


మన్యంకొండలో ఉట్లు కొడుతున్న భక్తులు

వైభవంగా రాములోరి కల్యాణం


బీచుపల్లిలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఎర్రవల్లిచౌరస్తా: శ్రీరాముని జన్మనక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరంచుకుని బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండరామస్వామి ఆలయంలో ఆదివారం సీతారాముల కల్యాణ వేడుకను వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు భువనచంద్ర, దత్తుస్వాముల ఆధ్వర్యంలో సీతారాములను ముస్తాబుచేసి వేదమంత్రాల నడుమ వైభవంగా కల్యాణాన్ని జరిపారు. కళ్యాణ కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ఆధ్యాత్మిక వాతావరణానికి పెద్దపీట

- శివపార్వతుల విగ్రహస్థాపనకు భూమిపూజ


బూడిదపాడు చౌరస్తాలో భూమి పూజ చేస్తున్న ఆలయ పాలకమండలి

జోగుళాంబ శక్తిపీఠం: జాతీయ రహదారి అలంపూర్ చౌరస్తా నుంచి ఆలయాల వరకు పుణ్యక్షేత్రం యొక్క విశిష్టత తెలిపే ఆధ్యాత్మిక వాతావరణం తీసుకొచ్చేందుకు ఆలయపాలక మండలి పెద్దపీట వేస్తుందని కమిటీ చైర్మన్ చిన్నకృష్ణయ్య తెలిపారు. ఆదివారం శ్రావణ ఏకాదశి కావడంతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. బూడిదపాడు చౌరస్తా వద్ద నంది విగ్రహం, భైరాపురం చౌరస్తా వద్ద శివపార్వతుల విగ్రహాలు స్థాపించేందుకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో నీలప్ప, వెంకటేశ్వర్‌రెడ్డి, రమేష్, కాశన్న, సీ.వెంకటేష్, వెంకటనారాయణ, అంపయ్య,లయ, అర్చకులు పాల్గొన్నారు.

ఆలయానికి వీల్ చైర్..

అనంతపురం చెందిన బొగ్గుల మురళీ ఆలయానికి వీల్ చైర్‌ను వితరణ చేశఇూరు. ఆలయానికి ఎంతో మంది వృద్ధులు, దివ్యాంగులు వస్తుంటారని వారు నడిచి వెళ్లడం ఇబ్బందిపడకుండా ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

కందూర్ గుట్టపై వాకర్స్ ట్రెక్కింగ్


రామలింగేశ్వరస్వామి గుట్టపై వాకింగ్ క్లబ్ సభ్యులు

అడ్డాకుల: వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణానికి చెందిన ఆరోగ్య వాకింగ్ క్లబ్ సభ్యులు ఆదివారం మండలంలోని కందూర్ శివారులో ఉన్న రామలింగేశ్వర స్వామి దేవాలయం గుట్టపై ట్రెక్కింగ్ నిర్వహించారు. కొత్తకోటకు చెందిన సుమారు 50 మంది వాకర్స్ ఇక్కడికి వచ్చారు. గుట్టపై ఉన్న ఆలయంలో దర్శనం చేసుకున్నారు. తర్వాత గుట్ట కింద ఉన్న ఆలయంలో రామలింగేశ్వరస్వామి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. నడకతో ఆరోగ్యం మెరుగవుతుందని వాకర్స్ పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకుడు శేఖర్‌గౌడ్, సభ్యులు రవికుమార్, ఎల్లయ్య, బాలకృష్ణారెడ్డి, రవీందర్‌రెడ్డి, మేఘారెడ్డి, రాములు, మన్నెం యాదవ్, వెంకటేష్, నగేష్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నాలుగేళ్ల తర్వాత ఇంటికి చేరిన మహిళ


తండ్రి కర్రెన్న, శ్రద్ధ ఫౌండేషన్ సభ్యులతో గిరమ్మ

కొత్తకోట రూరల్: మతిస్థిమితం లేకుండా తిరుగుకుంటూ వెళ్లిన ఓ మహిళా నాలుగేళ్ల తర్వాత ఇంటికి చేరుకుంది. ఈ ఘటన మండలంలోని కానాయపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన దేవరకుంట సరళమ్మ, కర్రెన్నల కుమార్తె వివాహిత గిరమ్మ మతిస్థిమితం లేకుండా గ్రామంలో తిరుగుతుండేది. నాలుగేళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. రెండేళ్లు వెతికినా ఎక్కడ ఆచూకీ లభించకపోవడంతో ఆశలు వదులుకున్నారు. ముంబైలోని శ్రద్ధ ఫౌండేషన్ సభ్యులు గిరమ్మను చేరదీశారు. మతిస్థిమితం నుంచి కోలుకునేవిధంగా చికిత్స అందించి గిరమ్మ నుంచి చిరునామా కనుకున్నారు. ఆదివారం శ్రద్ధ ఫౌండేషన్ సభ్యులతో కలిసి ఇంటికి వచ్చిన గిరమ్మను చూసిన కుటుంబ సభ్యులు ఆనందంలో ముగిగిపోయారు. ఫౌండేషన్ సభ్యుడు ప్రదీప్‌కుమార్‌కు గిరమ్మ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.